# సత్యవాక్యు

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

MARCH - 1998

# సంక్షిప్త వార్తలు

ఫిబ్రువరి మొదటి తేదీ ఆదివారం, విజయవాడ ధర్మాపురం సంఘము ద్వారా పూర్ణానంద పేటలో సువార్త ప్రకటింపబడగా 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు K. రాజకుమార్‌గారు, సామ్యూల్ రోనీ గూటం గారు వాక్య పరిచర్య గావించిరి. K. సాల్మన్‌రాజుగారు అక్కడ సేవచేయుచున్నారు.

ఫిబ్రువరి 13వ తేదీ శుక్రవారం కాకినాడ జగన్నాధపురం వాస్తవ్యులు సోదరులు T.జ్ఞానానందము గారి సతీమణి మేరీ జ్ఞానానందము గారు ప్రభువునందు నిద్రించిరి. 25వ తేదీనాడు స్మారక కూటము జరిగెను. పలువురు. బంధువులు, మిత్రులు, పుర ప్రముఖులు వచ్చి సోదరులు జ్ఞానానందము గారికి, వారి కుటుంబ సభ్యులకు ఆదరణ నిచ్చిరి.

ఫిబ్రువరి 15వ తేదీ ఆదివారం తొండంగి మండలం బెండపూడి క్రీస్తుసంఘము యొక్క ఆరాధనలో జాషువాగూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య గావించిరి. అక్కడ నూతనముగా నిర్మించబడిన ఆలయమును గూర్చి జాషువా గారు స్థానిక సంఘస్థులను అభినందించిరి. అక్కడ P. సమర్పణరావ్ గారు వాక్య పరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రువరి నెల సువార్తికుల సదస్సు 27వ తేదీన పెద్దాపురంలో ఆశీర్వాదకరముగ జరిగెను.. ఆయాప్రాంతాలలో క్రీస్తు జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు, క్రీస్తు రాజ్యవ్యాప్తిలో అలుపెరుగని సువార్తికుల సమక్షంలో "ఒకేఒక్క నిజసంఘము ఏది? దానిని గుర్తించుట ఎట్లు?" అను అంశము చర్చించబడెను. ఈ సదస్సుకు సువార్తికులు అధికసంఖ్యలో తరలి వచ్చిరి. సోదరులు రోయిస్ ఫ్రెడరిక్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి చక్కని వర్తమానమును అందించిరి.

కొన్నిరోజులుగా అనారోగ్యానికి గురైె దేవుని అత్యంత కృపా వాత్సల్యమును బట్టి కోలుకొని, సదస్సునకు విచ్చేసి, సదస్సునకు సమర్ధవంతమైన అధ్యక్షతను అందించి, చక్కని వర్తమానముతో సోదరుల హృదయాలను ఆదరింపజేసిన ప్రియ సోదరులు జాషువా గూటం గారి విషయమై సువార్తికులందరు దేవునికి కృతజ్ఞతాస్తుతులు తెలియజేసిరి.

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 మార్చి 1998 సంచిక 8


## సంపాదకీయం

## పురాతన మార్గములు

( The Old Paths )

అలనాడెప్పుడో దేవుని ప్రవక్త ఇట్లు చెప్పెను: "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. మార్గములలో నిలిచి చూడిడి. పురాతన మార్గములను గూర్చి విచారించుడి, మేలుకలుగు మార్గమేది అనియడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును. అయితే వారు మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు" (యిర్మీయా 6:16), ఈనాడును, ఆనాడును ఉన్న అన్ని కాలముల లోను ప్రజలు నడిచినట్టి, ఉపయోగించినట్టి మార్గములున్నవి. ఒక చోటునుండి మరొకచోటుకు వెళ్ళుటకుపయోగపడు మార్గములు ఇవి. అవి ప్రజలకు తెలిసినట్టివి, అంగీకరింప బడినట్టివి మరియు క్షేమకరమైనవి. అట్లే ఆత్మీయ జీవితములో కూడ దేవుడు తన ప్రజలకిచ్చిన మార్గములున్నవి. వాటిలో ఆయన ప్రజలు నడుచుకొనవలెనని ఆయన కోరుచున్నాడు. అవి పురాతనమైనవి. విపులముగా బయలు పరచబడినట్టివి. అవి శ్రేష్టమైనవి, క్షేమకరమైనవి. వాటి ననుసరించుట జ్ఞానయుక్తమే

కాకుండా వారు ఆ మార్గములో నడువవలెనని దేవుడు వారిని హెచ్చరించెను. దేవునియొక్క మరియొక ప్రవక్త ఇట్లు చెప్పెను.: "అక్కడ దారిగా నున్న రాజమార్గము ఏర్పడును. అది పరిశుద్ధమార్గమనబడును. అది అపవిత్రులు పోకూడని మార్గము. అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును. మూఢులైనను దానిలో నడచుచు త్రోవను తప్పక యుందురు" (యెషయా 35:8). అయితే దేవుని హెచ్చరికను లెక్కచేయక "వారు మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు". ఇది ఎంత తెలివితక్కువైన పని! గాని నేటి కాలమునకు ఏమీ భిన్నముగా లేదు.

యేసుక్రీస్తు ఈనాడు మనకు మార్గమైయున్నాడు (యోహాను 14:6). మన మాయన అడుగుజాడలలో నడుచుకొనునట్లు మనకొక మాదిరి యుంచిపోయెను (1పేతురు 2:21). మనందరము ఏ మార్గములో నడుచుకొందుమో నిశ్చయించుకొన గల్గునట్లు మన ముందు ఆయన ఇరుకు మార్గమును, విశాలమార్గమును ఉంచి యున్నాడు (మత్తయి 7:13,14). విశాలమైన మార్గముఒకటి యున్నది. దానిలో అనేకులు నడుతురు. అది నాశనమునకు పోవు మార్గము. రెండవది ఇరుకును, సంకుచితమువైయున్న మార్గము. దానిలో నడుచువారు కొందరే. అది నిత్యజీవము నకు పోవు మార్గము. నీవు ఏ మార్గములో ప్రయాణించుచున్నావు ?

మనకాలమందున్న వారికి దేవుడేర్పరచిన మార్గమును గూర్చి మరికొంత తెలిసికొందము. అది క్రొత్తనిబంధన పుటలలో స్పష్టముగా బయలుపరచబడిన మార్గము. కొంత సమయమును వెచ్చించి దేవుని గ్రంధమును చదువు ప్రతివాడును దేవుడు కోరుచున్న దేమిటో ఖచ్చితముగా తెలిసికొనగలడు. మనము గ్రహించి విశ్వసించి లోబడునట్లు దేవుని చిత్తమును మనము తెలిసికొనవలెనని ఆయన కోరుచున్నాడు. ఉదాహరణకు మనము ఆయన వాక్యమును చదువుచున్నప్పుడు మనము రక్షించబడగల్గునట్లు క్రీస్తు మనకొరకు చనిపోవుట మాత్రమేగాక (రోమా 5:8), మనము రక్షించబడవలనంటే మనము నెరవేర్చవలసిన కొన్ని షరతులను లేక ఆజ్ఞలను ఆయన ఇచ్చినట్లు కనుగొనగలము. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). మనము రక్షించబడవలనంటే మన మవలంబించవలసిన మార్గము అది.

అది పురాతనమైన మార్గము, నిజమే. కాని అది ప్రభువు మార్గము గనుక వేరొక మార్గమేదియు ఉండనేరదు.

మనము లేఖనములను చదువుచుయుండగా క్రీస్తు సువార్తకు లోబడి రక్షింపబడిన తరువాత ప్రభువు మనలను తన సంఘముతో చేర్చుకొనునని చెప్పబడియున్నది. (అపొ.కా. 2:47). ఆ సంఘము ఆయన సంఘము, అదిఆయనకు చెందియున్న సంఘము (మత్తయి 16:18; ఎఫెసీ 5:25). దానికి ఆయనే రక్షకుడు (ఎఫెసీ 5:23). మరియు అది ఆయన నామమును ధరించును (రోమా 16:16). మనము ప్రభువు మార్గముననుసరించునప్పుడు మనము మరియే సంఘమునకు గాక ఆయన సంఘసభ్యులమగుదుము.

మనము ప్రభువు మార్గము ననుసరించునప్పుడు ఆయనను ప్రతి ఆదివారము ఆరాధించెదము (అపొ.కా. 20:7). మిగిలిన క్రైస్తవులతో సమావేశమై వాక్యపఠనము గావింతము. (2తిమో 2:15), ప్రార్ధనచేతుము (అపొ.కా. 2:42), పాటలు పాడుదుము (ఎఫెసీ 5:19). ప్రభురాత్రి భోజనములో పాలుపొందుదుము. (1కొరింథీ 11:23-25). మరియు కానుకలిత్తుము (1కొరింథీ 16:2). అంతేకాకుండా మనము చేయ వలసిన దానిని గూర్చి పలుకవలసిన దానిని గూర్చిన సత్యమార్గమును దేవుని వాక్యము మనకు బయలుపరచుచున్నది (1పేతురు 4:11). ఇందువలన ఆయా విషయములను గూర్చిన దేవుని చిత్తమేమిటో తెలిసికొనగలుగుటయే గాక ఆయనకు అంగీకారముగా యుండు వాటిని మనము చేయవీలగును (యాకోబు 1:23).

విచారకరమైన యధార్ధత యేమంటే అందరు సత్యమును ప్రేమించుటలేదు. చాలామంది అజ్ఞానములో యుండి సంతృప్తి జెందు చున్నారు. వాళ్ళకు ఏవిధమైన తొందర ఎవరు కలుగజేయకూడదు. మత సంబంధముగా వారేమైయున్నారో వారికే తెలుసు. వారు ఎక్కడ యున్నారో అక్కడనే ఉండగోరుదురు. వారియొక్క ఉదాసీనతను బట్టియు విముఖతను బట్టియు వారు నాశనమగుదురు.

మనము సహృదయత కలిగి మన జీవనమునకు భక్తికి కావలసిన వాటన్నిటి

లోను దేవుని చిత్తమును ఎల్లప్పుడు తెలిసికొనుటకు ప్రయత్నించవలెను. సత్యము కంటె ఏదైనా తక్కువైన దానితో మనము సంతృప్తి జెందరాదు. దేవునిమార్గమును తెలిసికొనుటవలననే ఆయన చిత్తమునకు మనము లోబడగలము మరియు పరలోకపట్టణమగు ఆ నూతన యెరూషలేముకు పోయే మార్గమునందు ప్రయాణించ గలము.

దేవుని వాక్యము నందుంచబడిన పురాతన మార్గములకు మేము వెళ్ళు చుండగా మీరును మాతోకలసి రావవలెనని మేము మిమ్ములను ఆహ్వానించు చున్నాము. అట్లు చేయుటలో మీరు మమ్మును వెంబడించుటగాని, మేము మిమ్మును వెంబడించుట గాని జరుగదు. అయితే మనము ప్రభువును వెంబ డింతుము. మనమాయనమార్గములందు నడుచుకొందుము, ఆయన మనలను ఏమి చేయవలెనని కోరుచున్నాడో వాటిని చేతుము. మనమేమైయుండవలెనని ఆయన కోరుచున్నాడో అట్లేయుందుము. ప్రభువు మార్గమును ఆయన చిత్తమును మనము అడుగుదుము, వేరొకదానితో మనము సంతృప్తిజెందరాదు. మనము క్రీస్తును వెంబడించి, సరియైన మార్గములో యుండలేనియెడల వేరొకని ఎందుకు వెంబడించవలెను? భక్తి పరులముగా యేల ఉండవలెను ?తప్పుకానిది, సరియైనది ఒక మార్గమున్నది. అయితే "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గముకలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" అని జ్ఞాపకముంచుకొనుము (సామెతలు 14:12). ప్రభువు మార్గమే సరియైన మార్గము అని మనసులో నుంచు కొనుము. పరలోకమునకు వెళ్ళుమార్గము అది ఒక్కటి మాత్రమే. దీనిలో నడచు కొనువారు, లేదా ప్రయాణించు వారు మాత్రమే పరలోకమునకు వెళ్ళగలరు.

## దేవుని రక్షణ మార్గము
## ( God's Way of Salvation )

"వారందరును దేవునిచేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడి యున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నాయొద్దకు వచ్చును" అని యేసు చెప్పెను (యోహాను 6:45).

1. యేసు ఏల అవతరించెను?

a) నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" (లూకా 19:10).

b) "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 10:10).

2. ఎవరు రక్షించబడగలరు ?

a) "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను3:16).

b) ఎవరును నశింపవలెనని దేవుడు యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచున్నాడు (2పేతురు 3:9).

3. మన సంపూర్ణ మార్గదర్శి యేది ?

a) "మేము మీకు ప్రకటించిన సవార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:8).

b) లేఖనములు దైవజనుని ప్రతి సత్కార్యమునకు సంపూర్ణునిగా చేయును (2తిమో 3:16,17 ).

4. మనము ఎవరిని వినవలెను?

a) "ఈయన మాట వినుడి" (మత్తయి 17:3-8).

b) క్రీస్తును, ఆయన మాటలను వినవలెను (యోహాను 12:48).

5. దేవుడు మానవులను ఎట్లు పిలుచుచున్నాడు ?

a) తండ్రి మనలను ఆకర్షించవలెను (యోహాను 6:44,45).

b) ఆయన మనలను సువార్త ద్వారా పిలుచుచున్నాడు (2థెస్స 2:14).

6. మనము ఎట్లు రక్షింపబడుదుము ?

a) మనము తిరిగి జన్మించవలెను (యోహాను 3:3).

b) మనము నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించవలెను (యోహాను 3:5).

7. విధేయత అవుసరము :

a) తండ్రి చిత్తము జరిగించువాడే పరలోకరాజ్యములో ప్రవేశించును (మత్తయి 7:21).

b) "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై.. తనకు విధేయులైన వారికందరికి నిత్యరక్షణకు కారకుడాయెను"(హెబ్రీ 5:8,9).

8. విశ్వాసము అవుసరము :

a) "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6).

b) "నేను ఆయనననని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8:24).

9. మారుమనస్సు అవుసరము :

a) మారుమనస్సు పొందుడి లేదా నశించుడి (లూకా 13:3).

b) "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30).

10. ఒప్పుకొనుట అవుసరము :

a) రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనవలెను (రోమా 10:10).

b) క్రీస్తును ఒప్పుకొనువారందరిని ఆయన తండ్రియెదుట ఒప్పుకొనును (మత్తయి 10:32).

**11. బాప్తిస్మము అవుసరము :**

a) మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి (అపొ.కా. 2:38).

b) "బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1పేతురు 3:21).

c) "కనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుము" (అపొ.కా. 22:16).

**12. క్రియలు అవుసరము :**

a) "ఆయన పంపినవానియందు మీరు విశ్వాసముంచుటయే దేవునిక్రియ" (యోహాను 6:29).

b) "మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" (ఫిలిప్పీ 2:12).

c) మానవుడు క్రియల మూలముగా నీతిమంతుడని తీర్పునొందును (యాకోబు 2:24).

d) క్రియలులేని విశ్వాసము మృతము (యాకోబు 2:20, 26).

**13. అప్పుడు నీవే సంఘములో యుందువు ?**

a) రక్షింపబడుచున్న వారిని అనుదినము ప్రభువ వారితో చేర్చుచుండెను (అపొ.కా. 2:47).

b) యేసు తన సంఘమును నిర్మించుతునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18).

4. నీవు ఏ నామమున ధరించవలెను ?

a) "శిష్యులు మొట్టమొదట అంతియొకయలో క్రైస్తవులనబడిరి" (అపొ.కా. 11:26).

b) "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1పేతురు 4:16).

5. సంఘ సభ్యత్వము అవసరము :

a) క్రీస్తు రక్తముచే సంఘము సంపాదించబడెను (అపొ.కా. 20:28).

b) సంఘము క్రీస్తు శరీరమైయున్నది (1తిమో 1:22, 23).

c) సంఘము దేవుని కుటంబమైయున్నది (1తిమో 3:15).

d) రక్షింపబడినవారిని ప్రభువు దానితో చేర్చును (అపొ.కా. 2:47).

e) దేవుని వాగ్దానములన్నియు క్రీస్తునందున్నవి (2కొరింథీ 11:20).

f) ప్రతి ఆత్మీయాశీర్వాదము క్రీస్తునందున్నది (ఎఫెసీ 1:3). క్రీస్తునందుండుట అనగా ఆయన శరీరమైయున్న సంఘములో ఉండుటయే.

6. ఆత్మీయారాధన ఏది యగును ?

a) అది నిజ దేవునికి చేయబడవలెను (యోహాను 4:23).

b) అది సత్యవాక్యమును బట్టి, ఆయన అధికారమును పొందినట్టిదై యుండవలెను (యోహాను 4:24).

c) అది ఆత్మతో (గ్రహింపుతో) యుండవలెను (యోహాను 4:24).

17. క్రొత్తనిబంధన సంఘము యొక్క పాలన పద్ధతి యెట్లుండును ?

a) ప్రతి స్థానిక సంఘములోను పెద్దలు, పరిచారకులు, సభ్యులు ఉందురు (అపో.కా. 14:23, 1తిమో 3; తీతు1).

b) భూసంబంధ ప్రధాన కార్యాలయముగాని, శిరస్సు గాని యెవడు లేడు.

18. క్రైస్తవ పెరుగుదల అవసరము :

a) క్రైస్తవ సద్గుణములను పెంపారు చేసుకొనవలెను (2పేతురు 1:5:11).

b) ప్రభువుకు ఫలములను ఫలించవలెను (యోహాను 15:1-6).

c) మనుష్యుల యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి (మత్తయి 5:16).

19. పనిచేయు స్థానము సంఘమైయున్నది :

a) అదొక పందెము వలె మనము పరుగెత్తవలెను (హెబ్రీ 12:1).

b) ఒక సైనికుని వలె మనము పోరాడవలెను (1తిమో 6:12).

c) మనము వాక్యమును బట్టి నడుచుకొనువారమై యుండవలెను (యాకోబు 1:22).

d) మనము క్రీస్తు మాదిరి ననుసరించవలెను (యోహాను 9:4).

e) మన క్రియలను బట్టి మనకు తీర్పు తీర్చబడును (ప్రకటన 20:12).

f) ఈలోక తత్వమునకు విరుగుడు, పని.

g) పనిచేయు సంఘము పెనుగులాడు సంఘము కానేరదు.

h) ప్రేమవలన, కార్యసాధకమగు విశ్వాసము వలన మనము రక్షించబడుదుము (గలతీ 5:6). నీకు సమీపముగాయున్న క్రీస్తు సంఘారాధనలకు హాజరు కమ్ము!!

- W.A. బ్రాడ్ ఫీల్డ్.

# మరియను గూర్చిన మాయలు

## ( Myths about Mary )

యేసు తల్లియైన మరియ ఒక గొప్ప స్త్రీ. ఆమె రాజుల వంశావళి కలిగిన ఒక భక్తిగల యూదురాలు. ఆమె ఇంక కన్యగాయుండగానే పరిశుద్ధాత్ముని వలన అద్భుతరీతిగా గర్భమును ధరించి ఈలోక రక్షకునికి జననమిచ్చెను (మత్తయి 1:18-25). ఒక బాలునిగా యేసు తన తల్లికి లోబడెను. ఆయన పెరిగి పెద్దవాడైనను ఒక పురుషునికి తగిన రీతిగ ఆమెను ప్రేమించి గౌరవించెను (లూకా 2:51; యోహాను 19:26,27).

మరియను గూర్చి బైబిలు చెప్పునదంతయు సత్యము. ఆమె ధన్యురాలు, ప్రాముఖ్యమైన ఒక వ్యక్తి (లూకా 1:28-35). అయితే సహృదయులైన కొందరు సంవత్సరములు తరబడి మరియను గూర్చిన కల్పిత కధలను నమ్ముచువచ్చారు. మరియను గూర్చి ఆధునికముగా చెప్పబడుచున్న కొన్ని సంగతులు వట్టిమాయలు, హాస్యాజనకములు, అవి నిజానికి దేవదూషణకరమైనవి. వాటిలో ఈ దిగువ కొన్నిటిని పరిశీలింతము :

1. మరియ యొక్క శాశ్వత కన్యాత్వము ( The Perpetual Virginity of Mary ) : మరియ ఎల్లప్పుడు కన్యగానే యుండెనని కొందరు విశ్వసింతురు. క్రీస్తు జన్మించిన తరువాత ఆమె జీవించిన సంవత్సరములన్నియు ఆమె కన్యగానే యుండెనని వారు భావింతురు. అయితే మరియ యోసేపు యొక్క భార్య ఆయెనని (మత్తయి 1:16, 19-20, 24-25; లూకా 2:41). యేసుకు సహోదరులు, సహోదరీలు ఉన్నట్లు బైబిలు విశదముగా బోధించుచున్నది (మత్తయి 13:55; మార్కు 16:3).

మరియ శాశ్వతముగా కన్యయైయుండెనని వారి స్వాములు బహ్మచర్యము ననుసరించవలెనని ఆజ్ఞాపించుచు వివాహము ఒకని అపవిత్రపరచునని కేథలిక్కు సంఘము ప్రచారము చేయుచున్నది. వివాహము ఘనమైనదని (హెబ్రీ 13:4).

క్రీస్తు సంఘములో పెద్దగా లేక అధ్యక్షునిగా యుండుగోరువాడు వివాహితుడై యుండవలెనని బైబిలు చెప్పుచున్నది (1తిమో 3:1-2). యోసేపుతో తనకు జరిగిన వివాహమును బట్టి మరియ దాంపత్య జీవితమును కొనసాగించుట ఏమి తప్పుకాదు (1కొరింథీ 7:1-5).

2. పాపరహితముగా మరియ జన్మించుట ( The Immaculate Conception of Mary ) : పసిబిడ్డలు ఆదిమ పాపముతో జన్మింతురను నమ్మకము చొప్పున, కేథలిక్కు సంఘము మరియను పూజించు చుండిరి. అందువలన 1854 సంవత్సరములో పోప్ పయస్ IX అనునతడు మరియకు ఆదిమ పాపము లేదని వినాయించుటకు ఆమె పాపరహితముగా జన్మించెనని ప్రకటించెను.

పాపమనునది వారసత్వమువలన వచ్చునది కాదుగాని అది జరిగించుటవలన కలిగేది. "పాపము చేయువాడెవడో వాడే మరణమునొందును. తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుని దోషశిక్షను తండ్రిమోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:4,20).

చిన్నబిడ్డల యొక్క పవిత్రతను, అమాయకత్వమును యేసు బలపరచెను (మత్తయి 18:3-6). అట్టివారిదే పరలోక రాజ్యము అని ఆయన చెప్పెను (మత్తయి 19:14). ఆదాముద్వారా అందరికి మరణము సంప్రాప్తమాయెను అని బైబిలు చెప్పుచున్నది (రోమా 5:12). మరియు మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను (హెబ్రీ 9:27). అయితే ఒక తరము నుండి మరొక తరమునకు పాపము సంప్రాప్తమగునని గాని, పసిబిడ్డలు పాపమును వారసత్వముగా పొందుదురు అనిగాని బైబిలు చెప్పుటలేదు.

అద్భుతరీతిగా మరియ తనతల్లి గర్భములో పడెనని చెప్పువచనము బైబిలు లో ఒక్కటికూడా లేదు. అట్టి సిద్ధాంతమును గూర్చి యేసుగాని ఆయన అపొస్తలులు గాని కించిత్తుకూడ చెప్పలేదు. మరియ మృతిబొందిన కొన్నివందల సంవత్సరముల

తరువాత ఈ అబద్ధ సిద్ధాంతము కనిపెట్టబడెను. అది కేవలము మానవకల్పితమే.

3. మరియకు పాపము లేకపోవుట ( Sinlessness of Mary ) : మరియ యొక్క జీవితము పాపరహితమైనదని కేథలిక్కు సంఘము చెప్పుచున్నది. అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని బైబిలు బలముగా చెప్పుచున్నది (రోమా 3:23; గలతీ 3:22). ఈ నియమమునుండి యేసుక్రీస్తు ఒక్కడు మాత్రమే వినాయించబడిన వాడని బైబిలు చెప్పుచున్నది (1పేతురు 2:22; 2కొరింథీ 5:21; హెబ్రీ 4:15). దేవుడు తన రక్షకుడని మరియ పలికెను (లూకా 1:47). ఆమె పాపము లేనిదైతే ఆమెకు రక్షకుడు అవసరము లేదు. పాపరహితుడైన క్రీస్తుకు ఒక రక్షకుడవుసరమైనట్టు నీవు ఊహించగలవా ?

మరియకు పాపములేదని బోధించుటద్వారా ఆమెను మానవత్వమునుండి దైవస్థాయికి తీసుకొనినచ్చుటకు చేయుచున్న ప్రయత్నమదియని గోచరమగుచున్నది. అయితే మరియ ఒక మానవమాత్రురాలే. మరియ పాపములేని స్త్రీయని అపొస్తలులు లో ఎవడు, క్రొత్తనిబంధన వ్రాసిన ఆత్మావేశ లేఖకులలో ఎవడు, చివరకు యేసు క్రీస్తు కూడా ఎన్నడు బోధించలేదు. అయితే మరియను ఆరాధించుటకు మొదలిడిన సంఘము కనిపెట్టిన కట్టుకథ యిది.

4. మరియను ఆరాధించుట ( Worship of Mary ) : దేవుని ఆరాధించు మేము మరియను ఆరాధించుటలేదని కేథలిక్కులు బలముగా వాదింతురు. ఆరాధనను గూర్చిన వివిధ నిర్వచనములు అట్లుంచి మరియకు దైవనామములు అనేకములు ఈయబడినట్లు సామాన్య మానవుడెవడయినా ఇట్లే గమనించగలడు. ఆమెను దేవుని తల్లియని వారు పిలుతురు. రకరకాల సుఖసౌభాగ్యముల కొరకు వారామెను వేడుకొందురు. ఆమెను మధ్యవర్తియని, ప్రతినిధియని పిలుతురు. బైబిలు ఆమెను గూర్చి చెప్పుదానికంటె ఆమెను వారు ఎంతో ఎక్కువగా కొనియాడుదురు. ఆమెయొక్క పరిశుద్ధత ఒక గొప్ప ఆశ్చర్యకరమైన సంగతి! క్రొత్తనిబంధన ప్రకారము క్రైస్తవులందరు పరిశుద్ధులు (రోమా 15:26; ఫిలిప్పీ 1:1).

మానవుడు దేవుని ఆరాధించవలెనని బైబిలు బోధించుచున్నది (ప్రకటన 19:10; మత్తయి 4:10). ఆమెను కొనియాడే విధముగానైనను మరియను ఆరాధించవలెనని బైబిలు బోధించుటలేదు. క్రీస్తు తన శిష్యులకంటె పైగా ఆయన కుటుంబమును ఉంచుటకు ప్రయత్నించలేదు (మత్తయి 12:46-50). మరియకు చేసే వివిధ పూజలు మానవునినుండి కలిగినవే కాని దేవునివలన కలిగినవి కావు.

5. మరియ ఒక మధ్యవర్తి గా ( Mary as a mediator ) : కేథలిక్కులు మరియ ద్వారా ప్రార్థింతురు. దేవునికి మానవునికి ఆమె ఒక మధ్యవర్తియని వారు నమ్మెదురు. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసనునరుడు" అని 1తిమోతి 2:5లో అపొ.పౌలు చెప్పెను.

మానవులకు దేవునికి ఉన్న మధ్యవర్తి యేసుక్రీస్తు ఒక్కడే. మరియ ఒక మధ్యవర్తియను చెప్పు బోధ కేవలము కట్టుకథయే గాక అది దేవుని వాక్యమునకు వ్యతిరేకముగా యున్నది.

6. శరీరముతో మరియ ఆరోహణమగుట ( The Bodily Assumption of Mary ) : మరియ యొక్క శరీరము నేరుగా పరలోకమునకు తీసికొనపోబడెనని దానికి కుళ్లు పట్టబడనియ్యలేదని 1950వ సంవత్సరములో కేథలిక్కు సంఘము ఒక సిద్ధాంతమును ప్రకటించెను. మరియను మానవత్వము గల దానిగా యుండనిస్తే ఆమె శరీరము మన్నైపోవును (ప్రసంగి 12:7). గనుక కేథలిక్కు సంఘముమరియను దేవత్వము గలదానిగా చేయుటకు ఈ సిద్ధాంతమును ప్రవేశపెట్టెను. ఈ సిద్ధాంతము ను గూర్చిన ఋజువు బైబిలులో ఇసుమంతయును లేదు. మరియ మృతిబొందిన అనేక శతాబ్దముల వరకు కేథలిక్కులలో ఈ నమ్మిక ప్రబలి యుండలేదు.

7. అద్భుతములు ( Miracles ) : మరియ ద్వారా అనేక అద్భుతములు జరుగుచున్నవని కేథలిక్కులు రకరకాలుగా చెప్పుచుందురు. మరియ అద్భుతరీతిని వారికి కనబడెనని అనేకులు చెప్పుచుందురు. ఈ అద్భుత సంబంధ ఆరోపణలు అన్నియు ఆధునిక పెంతెకోస్తువారి ఆరోపణలవలెనే యుండును. అవన్నియును

బైబిలులో వాగ్దానము చేయబడని కనబడని భ్రమలు మాత్రమే.

యేసుక్రీస్తు, అపొస్తలులు బోధించిన బోధనే ఈనాడు క్రైస్తవులు కూడ బోదించవలెను (గలతీ 1:8,9). మరియను గూర్చి ఈ రకరకాల పారంపర్యములు ఆరంభించబడకముందే మనము నడచుకొనవలసిన విశ్వాసమార్గము బయలుపరచ బడి స్థిరపరచబడెను (యూదా 3; ప్రకటన 22:18,19). మరియను గూర్చిన ఈ సిద్ధాంతములు దేవునిచే నియమింపబడిన యెడల యేసుగాని, పౌలుగాని, పేతురు గాని వాటిని గూర్చి ఎందుకు చెప్పలేదు ?

"మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యేసు చెప్పెను (మత్తయి 15:9). దేవుడు తనకు తానే వ్యతిరేకముగా ప్రవర్తింపడు. ఆయన వాక్యమునకు వ్యతిరేకము గా మరియను గూర్చి యున్న ఈ సిద్ధాంతములన్నియు మానవకల్పితములే.

- ఆవెన్ కాస్ గ్రోవ్.

## పేతురు పోపా ?

### ( Was Peter a Pope ? )

మిగిలిన అపొస్తలులకంటె పేతురు అనేకసార్లు వ్యక్తిగత ప్రాముఖ్యత కలిగి యుండుట నిజమే. అపొస్తలుల జాబితాలన్నిటిలో అతని పేరు ముందు కనబడును (మత్తయి 10:2-4). అయితే ఈనాడు తరచుగా అగుబడుచున్న ప్రశ్న పేతురు ప్రముఖుడా ? యనునది కాదుగాని, పేతరు సంఘశిరస్సుగా యుండెనా ?మరియు రోమా పట్టణపు బిషప్పులు పేతురు తరువాత వచ్చినారా యనునది. పేతురు మొదటి పోప్ (Pope) అనియు, మన ప్రభువుయొక్క సంఘము అతనిపై నిర్మింప బడెననియు, అతనికిని అతని తరువాత వచ్చిన వారికిని సమస్తాధికారము ఈయ బడెననియు కొందరు భావింతురు. అయితే మన ప్రభువు పేతురుకు మత సంబంధమైన ప్రాముఖ్యతను ఏమియు ఇయ్యలేదని ఈ క్రింది లేఖనముల వలన తెలిసికొనవచ్చును.

1) సంఘపు పునాది పేతురు అని మత్తయి 16:18 బోధించుట లేదు. క్రీస్తు తన సంఘమును బండలో ఒక చిన్న ముక్క అయిన రాతిపై గాక అనిశ్చలమైన పర్వత బండపై అనగా పేతురు ఒప్పుకొనిన సత్యముపై నిర్మించెను.

2) మిగిలిన అపొస్తలులు నేరుగా క్రీస్తునుండియే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి. మరియు బంధించుటకును, విప్పుటకును సమానముగా ఆత్మ ప్రేరితులైరి (మత్తయి 18:18; యోహాను 20:21-23; అపొ.కా. 1:8; 2:1-4). గనుక పేతురుకు కలిగిన ప్రాముఖ్యత అంతా సువార్త ద్వారములను ఈ లోకమునకు మొదట తెరచుటలోనే యుండెను.

3) క్రీస్తు పేతురును సంఘశిరస్సుగా నియమించినట్లు గాని లేక వారందరిపై అధికారిగా నియమించినట్లు గాని అపొస్తలులెవరు భావించి యుండలేదు. ఫిలిప్పుదైన కైసరయలో సంభాషణ జరిగిన కొన్ని దినముల తరువాత సలోమియు ఆమెయిద్దరు కుమారులును ఆయన రాజ్యములో ప్రముఖ స్థానములను గూర్చి క్రీస్తునడిగిరి (మత్తయి 20:20-28; మార్కు 10:35-45). అంతేకాదు వారి ఆఖరి రాత్రి భోజనము దగ్గర ఆ పండ్రెండుగురిలో గొప్పవాడెవరోయని దానిపై వివాదమేర్పడెను (లూకా 22:24-30). అయితే ఈ గొప్ప స్థానమును అప్పటికే ప్రభువు పేతురుకు ఇచ్చియుండిన యెడల వారెవరును దాని సంగతి ఎరుగకుండుట వింతయే. అయితే మీరందరు సహోదరులనియు, వినయముతో పరిచర్య చేయుటలో నిజమైన ఘనత లభించుననియు, వారిలో ఎవడును మిగిలిన వారిపై అధికారము చేయరాదనియు క్రీస్తు తన శిష్యులకు చెప్పెను (మత్తయి 18:1-4).

4) అపొస్తలులలో ఒకనినని, యేసుయొక్క దాసుడనని, తోటి పెద్దనని పేతురు తననుగూర్చి తెలియజేసెను (1పేతురు 1:1; 2పేతురు 1:1; 1పేతురు 5:1). గాని భూమిపై సంఘమునకు తాను శిరస్సునని అతడెన్నడు చెప్పుకొనలేదు. మిగతా అపొస్తలులపై ఎట్టి అధికారమును చెలాయించలేదు. క్రైస్తవులు సజీవమైన రాళ్ళవలెనుండి పోపుగాయున్న అతనిపై గాక క్రీస్తుపై నిర్మించబడిన వారనికూడ అతడు తెలియజేసెను (1పేతురు 2:3-8).

5) పేతురు ఒక వివాహితుడు; అతనికొక భార్య, అత్తకూడ కలరు (మత్తయి 8:14). సంఘము స్థాపించబడిన అనేక సంవత్సరముల తరువాత కూడ అతడు తన భార్యను కలిగియుండెను (1కొరింథీ 9:5). పేతురు తరువాత వచ్చిన వారమని చెప్పుకొనువారి ఆచారమునకు ఇది విరుద్ధముగా యున్నది. అయితే పేతురు గనుక మొదటి పోపుగాని లేక బిషప్పు గాని అయ్యుంటే అతడు వివాహితుడై యుండెను; ఏలయనగా అధ్యక్షుడగువాడు ఏక పత్నీ పురుషుడై యుండవలెనని బైబిలు చెప్పుచున్నది (1తిమో 3:2-5; తీతు 1:6). ఏ విధముగానైనను ఈనాటి పోపుల ఆరోపణలను ఇది ఖండించుచున్నది.

6) మానవారాధనల వలన ఆనంద భరితులగుచున్న పోపుల స్వభావమునకు విరుద్ధముగా పేతురు మరొక మానవునినుండి అతడు ఆరాధనను అంగీకరించలేదు. సరిగదా అతని వ్యక్తిగత జీవితములో దోషము లేనివాడుకాదు. అతడొకసారి అపరాధిగా తీర్చబడెను గనుక పౌలు అతనిని ముఖాముఖిగా ఎదిరించెను. అతడు ఎన్నడు పొరపాటు పడని వాడైతే (infallible) ఈ సంగతి జరుగకపోవును (అపొ.కా. 10:25; గలతీ 2:11).

7) మిక్కిలి శ్రేష్టులైన అపొస్తలులకంటే నేను ఏ విషయములోను తక్కువ వాడను కాను అని పౌలు చెప్పెను. గనుక పౌలుకూడ సంఘశిరస్సుగా యుండెనా? (2కొరింథీ 11:5; 12:11). అట్లు కానేకాదు. సరిగదా ముఖ్యముగా అన్యజనులతో ఏర్పడిన సంఘమునకు ఎవడైనను శిరస్సుగా యుండతగిన యెడల అతడు పౌలు. ఏలయనగా అన్యజనాంగములకు అపొస్తలుడుగా యుండుటకు ప్రభువతనిని ఏర్పరచుకొనెను.

వాస్తవముగా పేతురుయొక్క మత సంబంధ ప్రాముఖ్యతను గూర్చి క్రీస్తు ఎన్నడు పలుకలేదు. పేతురు ఆరోపించుకొనలేదు. మిగిలిన అపొస్తలులు దానిని అంగీకరించలేదు. ఏ రీతిగనైనను పేతురు సంఘశిరసుస్సుకాదు. సంఘము స్థాపించబడిన తరువాతను పరిశుద్ధాత్ముడు అపొస్తలులను సర్వసత్యములోనికి

స్థాపించిన తరవాతను అపొస్తలులెవరు పేతురు తమ అధికారియనిగాని లేక సంఘశిరస్సు అనిగాని పలుకలేదు. సరిగదా సంఘమను శరీరమునకు క్రీస్తే శిరస్సు అనియు, ఆయనకు అన్నిటిలోను ప్రాముఖ్యము కలుగవలెననియు వారు బోధించిరి (కొలస్స 1:18).

మత్తయి 16:18 ప్రకారము పేతురుకేదో ప్రముఖ స్థానము ఈయబడినదని మనము అంగీకరించామనుకొందాము. అయినను కూడ పేతురు రోమాలో బిషప్పుగా యున్న ఋజువులేమియు లేవు. ఒకవేళ రోమాలో బిషప్పుగా యున్నను అతని ప్రముఖతను మరొకనికిచ్చిన ఋజువేమియులేదు. అపొస్తలులను నేరుగా ప్రభువే నియమించెను. వారి తరువాత వారి స్థానము నలంకరించిన వారెవరును లేరు. పేతురు తరువాత పొరపాటు చేయనివారు అతని స్థానమునలంకరించవలెనని, అట్టివారు క్రీస్తు ప్రతినిధులని సంఘశిరస్సు అని బైబిలు ఎక్కడ బోధించుటలేదు. పేతురు ఎన్నడయినా రోమా పట్టణములో యున్నట్టి వాస్తవ మేదియు కనబడుటలేదు. అదొక పారంపర్యాచారమే. అయితే రోమాలో యున్న పోపులందరి ఘనతకు, దోషరహితత్వ ఆరోపణలకు యిది మాత్రమే ఆధారమై యున్నది.

సీయోను పేతురు రోమా పట్టణపు మొదటి బిషప్పు కాదనియు సంఘశిరస్సు కాదనియు నిరూపించుకొనుట కొరకు ఈ దిగువ వాస్తవములను గమనించుము: 1) పేతురు రోమాలో పోపుగా యుండెనని వినబడుచున్న క్రీ॥శ॥ 44వ సంవత్సరములో అతడు యెరూషలేములో యుండెను (అపొ.కా. 12). 2) పౌలు కొరింథునుండి రోమీయులకు పత్రికను వ్రాసినప్పుడు క్రీ॥శ॥ 58లో పేతురు రోమాలో లేడు. ఆ పత్రికలో పేతురు అక్కడ ఉన్నట్లేమియు చెప్పబడలేదు. ఇరవై ఏడుగురు క్రైస్తవులకు శుభమని చెప్పిన తరువాత పౌలు పోపును మరచియుండుడు గదా ? 3) కొన్ని సంవత్సరముల తరువాత పౌలు ఒక ఖైదీగా రోమాకు వెళ్లి అక్కడ రెండు సంవత్సరములుండెను. ఆ సమయములో అతడు కొలస్సయులకు, ఫిలేమోనుకు, ఎఫెసీయులకు ఫిలిప్పీయులకు పత్రికలను వ్రాసెను. ఈ ఒక్కొక్క పత్రికలో అతడు అనేకులను గూర్చి వ్రాసినను పేతురు గూర్చి అతడేమియు వ్రాయలేదు.

పేతురు గనుక పోపు అయిన యెడల పౌలు అతనిని మరల నిర్లక్ష్యము చేసెనా ? 4) తరువాత పౌలు రోమా నుండి తిమోతికి రెండవ పత్రికను వ్రాసెను. అయినను ఆ పట్టణములో పేతురు యొక్క ఉనికిని గూర్చి దానిలో ఏమియు చెప్పబడలేదు. అందరు అతనిని విడచి వెళ్ళిరి గాని లూకా మాత్రమే తనయొద్ద ఉన్నాడని పౌలు చెప్పెను. (2తిమో 4:11). పేతురు ఎక్కడున్నాడు ? మరణ గడియలో అతని సందర్శించుటకు పోపు భయపడెనా ? 5) పేతురు వ్రాసిన రెండు పత్రికలలోను అతడు రోమాలో నివసించినట్లు ఏమియు చెప్పబడలేదు. సరిగదా దానికి తూర్పుగాయున్న బబులోనులో అతడుండెను. (1పేతురు 5:13). 6) ఆత్మ ప్రేరిత లేఖకుడెవడును పేతురు రోమాలో యున్నట్లు ఎన్నడు చెప్పలేదు. అయితే ఎప్పుడైనా భూగర్భ పరిశోధనలనుబట్టి పేతురు రోమాలో చనిపోయెనని నిరూపించ గలిగిన యెడల, అక్కడనుండి సంఘశిరస్సుగా అతడు పరిపాలించెనని రోమా పట్టణ బిషప్పులు అతని స్థానము నలంకరించువారని, సంఘశిరస్సులని, రక్షణ పొందుటకు ప్రజలు రోమాలోని పోపుకు లోబడవలెనని చేయు ఆరోపణలు మాత్రము ఇంకను లేఖనములలో ఆధారములేనివి గానే యుండును.

సర్వాధికారమును కలిగి సార్వజనిక సంఘశిరస్సుగా క్రీస్తు మాత్రమే యున్నాడు; ఆయన పరమందు నిత్యము జీవించును. క్రీస్తుసంఘ ప్రధాన కార్యాలయము పరమందే యున్నది. ఆయన సంఘమునకు భూమిమీద ప్రధాన కార్యాలయమేమియు లేదు (ఫిలిప్పీ 3:20).

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఇహ పరములయందు ఆయన సర్వాధికారము కలదని చెప్పెను (మత్తయి 28:18). సంఘమునకు భూమిమీద ఒకరును పరలోకములో ఒకరును శిరస్సుగా లేరు. దృశ్యాదృశ్య శిరస్సులతో సంఘము దృశ్యాదృశ్యముగా యుండునని చెప్పువారు బైబిలులో లేనిపదముల నుపయోగించుచున్నారు. క్రీస్తు సంఘముపై అధికారిగా యుండు తరుణము భూమిమీద ఎవనికి ఈయబడలేదు. సరిగదా ఒక మానవునికి ఆయన సంఘమునకు కట్టడలను నియమించు అధికారము ఆయన ఎన్నడు ఈయలేదు. సంఘము

క్రీస్తుకు లోబడియుండవలెనని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 5:24). గనుక పొరపాట్లు చేయగల మానవ మాత్రుడెవడును ప్రభువు సంఘమునకు శిరస్సుగా లేడు.

## మొదటిపోపు ఎప్పుడు ఆవిర్భవించెను ?

"పోపు" అను పదమునకు తండ్రియని అర్థము. యేసు ఇట్లనెను: "భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరుపెట్టవద్దు: ఒక్కడే మీతండ్రి: ఆయన పరలోక మందున్నాడు" (మత్తయి 23:9; కీర్తన 111:9).

అన్ని రకములైన మత సంబంధ బిరుదులను, దుస్తులను ప్రభువు ఖండించెను. నేను ఘనుడను, నీవు అల్పుడవు అనే భావము పోపులగుటకు దారి తీసెను. అయితే అపొస్తలులు చనిపోయిన కొన్ని వందల సంవత్సరముల వరకు పోపులు ఉద్భవించలేదు. చరిత్ర ప్రకారము ఈనాడు "పోపు" అనబడే బిరుదు ఈ దిగువ రీతిగ ఆవిర్భవించెను: క్రీ॥శ॥ 533లో రోమాలో యున్న బిషప్పునకు జస్టీనియన్ అనునతడు "సంఘప్రభువు" అనే బిరుదునిచ్చెను. క్రీ॥శ॥ 588లో కాన్స్టాంటినోపిల్‌లో బిషప్పుగా యున్న జాన్ ది ఫాస్టర్ అనునతడు సంఘపు సార్వజనిక బిషప్పు (Universal Bishop) అనే బిరుదును తనకు తానే ధరించుకొనెను. అతడా పని చేసినందుకు రోమా బిషప్పయిన గ్రెగరీ ది గ్రేట్ అతనిని తీవ్రముగా ఖండించెను. అయితే కొన్ని సంవత్సరములు గడచిన తరువాత ఫోకస్ అను బహు రక్తదాహము గల రోమా చక్రవర్తి ఆ బిరుదును క్రీ॥శ 606లో బోనిఫేస్ III అనునతనికి ధరింపజేసెను. నాటినుండి నేటివరకు రోమా బిషప్పులందరు ఒకరి తరువాత మరొకరు ఆ బిరుదును ధరించుకొనుచున్నారు. మొదటి ఆరు శతాబ్దములలో జరిగిన సంఘ సభల తీర్మానములను అన్నిటిని పరిశీలించి చూచిన, పోపుయొక్క ఉనికిని గూర్చి గాని, సార్వజనిక బిషప్పును గూర్చి గాని గ్రెగరీ ది గ్రేట్ లేక జాన్ ది ఫాస్టర్ కాలము వరకు కనుగొనలేము. సార్వజనిక సంఘశిరస్సు అనే బిరుదును జాన్ ది ఫాస్టర్ మొదట ధరించుకొనెను. అయితే అప్పటికి రోమాలో యున్న బిషప్పు అది లేఖన విరుద్ధమని, క్రైస్తవ్య విరుద్ధమని, దయ్యముల సంబంధమైనదని దానిని వ్యతిరేకించెను.

సంఘ చరిత్రను బాగుగా పరిశీలించిన, రోమన్ కేథలిక్కు సంఘపాలన క్రొత్త నిబంధనను బట్టిగాక పురాతన రోమా సామ్రాజ్య ప్రభుత్వ మాదిరిని బట్టి యున్నదని, అది సత్యము నుండి క్రమముగా భ్రష్టత్వములో పడుటవలన సంభవించెనని విశదమగును (2థెస్స2).

పోపుల మతాధికారము మూడు ఊహలపై నిలచి యున్నది: 1) సంఘములో పేతురు సర్వాధికారమును కలిగియుండెననునది. 2) పేతురు రోమా పట్టణపు మొదటి బిషప్పు లేక పోపు అనునది. 3) పేతురుకున్న ప్రత్యేక శక్తి అతడు మరణించగా అతని స్థానము నలంకరించిన వానికి, తరువాత అందరికి అందించ బడెననునది., అయితే ఈ ఊహలన్నియు అబద్ధములే. గనుక బైబిలు బోధను బట్టి సంఘము యొక్క అధికారమును గూర్చి యున్న ఆరోపణలన్నియు దోష భరితమైన పునాదిపై ఆధారపడి యున్నవని బయల్పడినది.

- పెర్రి బి. కోతమ్.

## క్రీస్తునందున్న దీవెనలు
### ( Blessings in Christ )

మానవులనందరిని ఏదో ఒక రీతిగ దేవుడు దీవించుచునేయున్నాడు. గాలి, నీరు, ఆహారము, వస్త్రములు మొదలగు వందలకొలది అవుసరములను ఆయన మానవులకు అనుగ్రహించుచున్నాడు. భక్తుడైన యాకోబు బైబిలునందు ఇట్లను చున్నాడు: "శ్రేష్టమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధ మైనదై జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి వచ్చును; ఆయన యందు ఏ చంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేదు" (యాకోబు 1:17). "దేవుడు చెడ్డవారిమీదను, మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు" అని క్రీస్తు పునరుద్ఘాటించెను (మత్తయి 5:45).

మరికొన్ని దీవెనలు దేవునికి లోబడువారికి మాత్రమే ప్రత్యేకముగా యుంచబడినవి. ఇవి ఆత్మీయ దీవెనలు, అవి క్రీస్తునందు మాత్రమే దొరుకును. "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" అని అపో.పౌలు వ్రాసెను (ఎఫెసీ 1:3).

ఈ ఆశీర్వాదములు క్రీస్తులోనే, కేవలము క్రీస్తులోనే దొరుకుచున్న యెడల, ఒకడు క్రీస్తునందు ప్రవేశించుట యెట్లు ? అనే ప్రశ్న ఉద్భవించును. లేఖనములలో రెండు వచనములు దీనికి జవాబిచ్చుచున్నవి. మొదటిది-రోమా 6:3 - "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ?" రెండవది - గలతీ3:26,27- "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు".

దీనినిబట్టి ఒకడు దేవునికి విధేయుడైనప్పుడు సమస్త ఆత్మీయ ఆశీర్వాదములు కలిగియున్న క్రీస్తులో ప్రవేశించునని మనము గ్రహించుకొనగలము. క్రీస్తులోనికి ప్రవేశించకుండ ఒకడు దేవునికి విధేయుడు కాజాలడు. బాప్తిస్మము లేకుండ ఎవడును క్రీస్తులో ప్రవేశింపజాలడు. ఈయాశీర్వాదములను పొందు మార్గము ఇది ఒకే ఒక్కటి మాత్రమే. 'క్రీస్తునందు' అను పదము ఒకడు ప్రవేశించు పరిస్థితిని సూచించుచున్నది. ఇది రక్షించబడిన స్థితి, క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరమగు సంఘములో యున్న స్థితి (2కొరింథీ 5:17; కొలస్స 1:18; ఎఫెసీ 1:22,23).

దేవుడు తన ప్రజలకు దాచియుంచిన దీవెనలన్నియు ఇక్కడ దొరుకును. అవి క్రీస్తులోనే గాని ఆయనకు వెలుపల లేవు. దేవునికింకను లోబడనివారు వాటిని పొందజాలరు. వారు పొందగలిగిన యెడల ఆయనకు విధేయత చూపించవలసిన కారణమే లేదు. అయితే సాధారణముగా మనుష్యులు ఈలోకములో పొందు దీవెనలకన్న దేవుడు తన ప్రజలను ఎక్కువ దీవించెదనని వాగ్దానము చేసెను.

అయితే క్రీస్తునందున్న కొన్ని ఈ ఆత్మీయాశీర్వాదములేవి ?

**1. క్రీస్తునందు క్షమాపణ :** "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7).

**2. క్రీస్తునందు పరిశుద్ధాత్మయను వరము :** "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

**3. క్రీస్తునందు సజీవులుగా చేయబడుట :** "ఆదామునందు అందరుఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1కొరింథీ 15:22).

**4. క్రీస్తునందు నూతన సృష్టియగుట :** "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2కొరింథీ 5:17).

**5. క్రీస్తునందు అందరు సమానులే :** "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు, యేసుక్రీస్తునందు మీరందరు ఏకముగా ఉన్నారు" (గలతీ 3:28).

**6. ప్రార్థించు తరుణము క్రీస్తునందున్నది :** "దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము; ఎవడైనను దైవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును" (యోహాను 9:31).

**7. క్రీస్తునందున్న వారితో ఆయన సదాకాలము ఉందునని వాగ్దానము చేసెను :** "ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:20).

**8. క్రీస్తునందు నిరీక్షణ యున్నది:** "మీ ప్రయాసమును మన ప్రభువైన

యేసుక్రీస్తు నందలి నిరీక్షణతో కూడిన మీ ఓర్పును, మేము మన తండ్రియైన దేవుని యెదుట మానక జ్ఞాపకము చేసికొనుచున్నాము" (1థెస్స 1:3).

ప్రభువుతో కలిగిన నూతన సంబంధములో మనకు లభించు ఆశీర్వాదములలో ఇవి కొన్ని మాత్రమే. నీవు క్రైస్తవుడవు కానియెడల నీవేమి పోగొట్టుకొనుచున్నావో నీకు తెలియదు. క్రైస్తవునికి భౌతిక ఆశీర్వాదములే గాకుండ ఆత్మీయాశీర్వాదములన్నియు లభించును. క్రీస్తునందు అతడున్నాడు. వాటితో అతడు భాగ్యవంతుడు. నీవు దేవునికి లోబడి అట్టి యాశీర్వాదములన్నియు దొరుకు క్రీస్తులో ప్రవేశించిన యెడల వాటిని నీవు కూడ పొందగలవు (మార్కు 16:16; అపొ.కా. 2:47; ఎఫెసీ 1:22,23; ఎఫెసీ 1:3).

\- జె. సి. ఛోట్.

## పరస్పర బాధ్యతలు

### ( Reciprocal Responsibilities )

1. ఒకని నొకడు ప్రేమించుడి. యోహాను 13:34; 1పేతురు 1:22; 1థెస్స 3:12.
2. ఒకనినొకడు బుద్ధి చెప్పుకొనుడి. రోమా 15:14; హెబ్రీ 3:14; కొలస్స 3:16.
3. ఒకరితో ఒకరు సమాధానముగా ఉండుడి. మార్కు 9:50.
4. ఘనత విషయములలో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి. రోమా 12:10; యోహాను 5:44.
5. ఒకనితోనొకడు మనస్సు కలిసియుండుడి. రోమా 12:16,15:5; 1కొరింథీ 12:25.
6. ఒకనియందొకడు అనురాగము గలవారైయుండుడి. రోమా 12:10.
7. పరస్పర క్షేమాభివృద్ధి కలుగజేసుకొనుడి. రోమా 14:19.
8. ఒకనినొకడు దాసులైయుండుడి. గలతీ 5:13.
9. ఒకని భారముల నొకడు భరించుడి. గలతీ 6:2.

10. ఒకరినొకరు క్షమించుడి. ఎఫెసీ 4:32; కొలస్స 3:13.

11. ఒకనిమీద ఒకడు సణగకుడి. యాకోబు 5:9.

12. ఒకనికొకడు లోబడియుండిడి. ఎఫెసీ 5:21; 1పేతురు 5:5.

13. ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి. కొలస్స 3:9.

14. ఒకనినొకడు సత్కార్యములు చేయుటకు పురికొల్పుకొనుడి. హెబ్రీ 10:25.

15. ఒకనినొకడు ఆదరించుడి. 1థెస్స 4:18.

16. ఒకనినొకడు హెచ్చరించుకొనుడి. హెబ్రీ 10:24.

17. ఒకనితోనొకడు మీ పాపముల నొప్పుకొనుడి. యాకోబు 5:16.

18. ఒకనికొకడు ఆతిథ్యము చేయుడి. 1పేతురు 4:9.

19. ఒకనితో ఒకడు సహవాసము కలిగియుండుడి. 1యోహాను 1:7.

20. ఒకరి సుఖదుఃఖములయందు ఒకరు పాలుపొందుడి. 1పేతురు 3:8.

21. ఒకనినొకడు చేర్చుకొనుడి. రోమా 15:7.

22. ఒకడు సత్యమునుండి తొలగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్ళించుడి. యాకోబు 5:19.

23. ఒకనినొకడు సన్మానించుకొనుడి. 1పేతురు 2:17.

24. ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. యాకోబు 5:16.

25. ఒకని కొకడు వందనములు చేయుడి. రోమా 16:16.

- ప్రభుదాస్ సబ్బతి, హైదరాబాద్.

Edited & Published by Joshua Gootam & Printed at Satya Vani, Kakinada - 533 004.

సోదరులు డి. ఇశ్రాయేలు రాజు, వి. చిన్నయ్య, జి.షద్రక్, పి.జి. సువర్ణరత్నం, కె. కామేశ్వర్రావు, డి. రంగారావు, రోయిస్ ఫ్రెడరిక్ మరియు జాషువా గూటం గార్లు ఈ అంశముపై చర్చని వర్తమానమును అందించిరి.

నేటి క్రైస్తవలోకంలో అనేక విభజనలు కనిపిస్తున్నాయి. ఐక్యతయను బంగారు తీగ చుట్టబడిన పరిశుద్ధ గ్రంధం ఈ విభజనకు కారణం కాదు. మానవుడు తన మనోభావాలను, ఆలోచనలను, తన స్వంత సిద్ధాంతాలను ప్రవేశపెట్టి సంఘముయొక్క ఏకత్వానికి, ఔన్నత్యానికి భంగం కలిగించుచున్నాడు. ఈ పరిస్థితులలో, "ఒకే ఒక్క నిజ సంఘము ఏది? దానిని గుర్తించుట ఎట్లు?" అను ప్రశ్నకు బైబిలునుండి సమాధానం కనుగొని దానికి విధేయులమైతే రక్షణ, నిత్యజీవం మనకు సాధ్యము.

ఏ సంఘమయితే బైబిలు బోధించిన ఉపదేశ క్రమాన్ని అనుసరిస్తుందో అంటే దాని పరిపాలన విషయంలోను, ఆరాధనా క్రమములోను, రక్షణాసంకల్పమును అనుసరించుటలోను అది పిలువబడే నామము విషయంలోనూ లేఖనముల ననుసరిస్తుందో అదియే నిజసంఘము. దానికొరకు తన్నుతాను అప్పగించుకొనిన క్రీస్తు నామమును ధరింపకయే "మేము ఆయన సంఘము" అని చెప్పుకొనుట హాస్యాస్పదము. సంఘము ఆయన పెండ్లి కుమార్తె (ప్రక19:6-7). క్రీస్తుసంఘమును ప్రేమించి అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనది గాను, నిర్దోషమైనదిగాను మహిమ గల సంఘముగాను దానిని నిలువబెట్టుకొనవలెనని కోరుచున్నాడు (ఎఫెసీ 5:25).

యెషయా, యిర్మీయా, దానియేలు మొదలగు ప్రవక్తలు దీనిఔన్నత్యమును గూర్చి ప్రవచించిరి. క్రీ.శ. 33వ సం॥రములో పెంతెకోస్తు అను పండుగ దినాన అది యెరూషలేములో స్థాపింపబడెను. ఈ సంఘము రాజ్యము, పొలము, ద్రాక్షతోట, పెండ్లికుమార్తె, మందఅను పర్యాయ పదాలతో క్రొత్త నిబంధన యందు వర్ణింపబడినది. సంఘము యొక్క పని, దాని అభివృద్ధి దాని ఔన్నత్యమును గూర్చి ప్రభువు మత్తయి సువార్తయందు అనేక ఉపమానములను బోధించెను. 'రాజ్యము' అను పదము మత్తయి సువార్తనందు ఎక్కువగ కనిపించును. పనివారమైన మనము ఆయన పనిని ఆసక్తితోను పట్టుదలతోను జరిగిస్తే ఆయన నిజసంఘాన్ని అనేకులు గుర్తించగలుగుతారు. సంఘము ఆయన శరీరమైతే దానికి శిరస్సు క్రీస్తు (ఎఫె 1:22-23).

శిరస్సునందు ను శరీరమందును ఒకే రక్తము ఎట్లు ప్రవహించుచున్నదో అట్టి అనుబంధము క్రీస్తుకు ఆయన శరీరమైన సంఘమునకు మధ్యనున్నది. క్రీస్తు సంఘము వేరువేరని చెప్పువారికి ఆయన సంకల్పమేమిటో తెలియదు. పాడుటయందును, ప్రభురాత్రి భోజనము ఆచరించుట యందును, ఆయన ఆజ్ఞలననుసరించుట యందును మంచి క్రైస్తవ జీవితము జీవించుట యందును క్రీస్తుసంఘము లేఖనముల అధికారమునకు లోబడును.

స్నేహితుడా, నిజసంఘమును గుర్తించుము. విధేయుడవై ఆయన నిజ సంఘము లో మరణమువరకు నమ్మకముగా నుండుము. అని సోదరులు హెచ్చరించిరి. సదస్సు అనంతరము 6గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు టి.సి.హెచ్. ఫ్లైమింగ్స్ గారు మరియు స్థానిక సంఘము చక్కని ఏర్పాట్లు చేసి సదస్సును ఘనంగా జరిగించిరి. సదస్సు సోదరులు E.K.V. ప్రసాదరావు గారి ప్రార్థనతో ఆరంభమై, A. విశ్వేశ్వరరావ్ గారి ప్రార్ధనతో అంతమయినది.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications , Kakinada - 533 004.

PRINTED BOOK - BOOK POST

From:
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To